క్లుప్తంగా

కౌన్సిలర్ గౌరవ వేతనం వితరణ



సత్తెనపల్లి: పట్టణంలోని 24వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ తన ఉదారతను చాటుకున్నారు. తన గౌరవ వేతనాన్ని ప్రతి నెలా తన వార్డులోని ఒక పేద కుటుంబానికి అందజేస్తున్నారు. ఈ నెలలో వచ్చిన వేతనాన్ని వార్డులోని పులిపాటి వెంకటేశ్వర్లు కుటుంబానికి అందించారు. స్థానిక కౌన్సిలర్లు, నాయకులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గంగారపు నవీన్, జవంగుల సాయి, సముద్రాల నరసింహారావు, దామెర్ల జగన్మోహన్‌రావు, జింకా పుల్లారావు, వల్లెం నరసింహారావు, ఉల్లంగుల ప్రసాద్, మందడపు శివసాయి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మందులు పంపిణీ



సత్తెనపల్లి: పట్టణంలోని పురపాలక సంఘంలో పని చేస్తున్న 156 మంది పారిశుద్ధ్య కార్మికులకు మల్టీ విటమిన్ టాబ్లెట్లను ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి ట్యాబ్లెట్లను కార్మికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సెగ్గెం వెంకటేశ్వరరావు, వాకుమళ్ల చెంచిరెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు, మున్సిపల్ డీఈ మధుసూదన్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్రోసూరు ఏఎంసీ సమీక్ష సమావేశం



క్రోసూరు: ఇటీవల ప్రమాణస్వీకారం చేసిన క్రోసూరు మార్కెట్ కమిటీ సభ్యులు సోమవారం తొలిసారిగా సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, పాలక వర్గ సభ్యులు యార్డు అభివృద్ధికి, రైతుల కోసం తీసుకోవాల్సిన పలు కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో కార్యచరణ రూపొందించి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే సూచనల మేరకు ముందుకు కొనసాగటం జరుగుతుందని తెలిపారు. యార్డు సెక్రటరీ శంకరరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు సత్కారం



సత్తెనపల్లి: స్వామి వివేకానంద చైతన్య భారతీ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నూతనంగా నియమితులైన దేవరశెట్టి రవికుమార్‌ను సోమవారం నిత్యయోగ సాధకులు ఘనంగా సత్కరించారు. మెమెంటోను బహూకరించారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయి పదవులు పొందాలని ఆకాంక్షించారు. జేపీఎస్ శాస్త్రి, లక్ష్మయ్య, పులహరి భానోజీ, వెంకటేశ్వరరావు, నగేష్, సునీల్, సీనియర్ న్యాయవాది ఇ.ఎల్లారెడ్డి, పులికొండ శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గంగమ్మతల్లి తిరునాళ్ల



పెదకూరపాడు: గారపాడులో గంగమ్మతల్లి తిరునాళ్లను మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారు జాము నుంచే ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 108 బిందె జలాలతో అమ్మవారిని అభిషేకించి, పట్టు వస్త్రాలతో అలంకరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమాలు, అమ్మవారి అష్టోత్తర, శతనామార్చనలు, పారాయణం జరుగుతాయని చెప్పారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవాలని వారు కోరారు.

నేడు వాహనాల వేలం

మాచర్ల: పట్టణంలో ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో నాటుసారా, అక్రమ మద్యం రవాణా చేస్తూ పట్టుబడి వాహనాలకు మంగళవారం వేలంపాట నిర్వహించనున్నట్లు సీఐ జీవీ ప్రసాదరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వేలంపాటలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పాలనలో విప్లవాత్మక మార్పులు

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: పల్లె పాలనలో విప్లవాత్మకమైన మార్పులతో సంక్షేమాన్ని అందిస్తూ, ఆర్థిక స్వావలంబన మెరుగుపరిచామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రెంటపాళ్ల గ్రామంలో మూడేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించి, అందిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. వలంటీర్ల సేవలను గురించి ఆరా తీశారు. సంతృప్తికర స్థాయిలో సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రజలు స్పష్టంగా పేర్కొనడంతో అంబటి సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఆలోచన, ఆచరణతో పేదలకు అండగా ఉంటున్నామన్నారు. గడప గడపకు కార్యక్రమంలో వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని ప్రజా ప్రతినిధులను, అధికారులను ఆయన ఆదేశించారు. సీసీ రోడ్లు, కల్వర్టులు, సైడ్ డ్రెయిన్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి మౌలిక వసతుల కల్పనకు సచివాలయ నిధులు వెచ్చించనున్నామని పేర్కొన్నారు. కార్య క్రమంలో సర్పంచ్ ఏకుల మనీషా, ఎంపీటీసీ నక్కా పద్మ, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, నాయకులు కొండ్రకుంట వెంకటేశ్వర్లు, నాగమల్లేశ్వరరావు, నలబోతు శివన్నారాయణ, సంకటి సంసోను, చిలుకా జయపాల్, చల్లా శ్రీనివాసరావు, కొమెర శివశంకర్, తోట సాంబశివరావు, మారిశెట్టి సైదయ్య, పల్లె గాబ్రియేలు, వల్లెపు.సహదేవుడు, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ జీవీ.సత్యనారాయణ, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.



రెంటపాళ్లల్లో మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

వైభవంగా గంగమ్మతల్లి తిరునాళ్ల

బెల్లంకొండ: మండలంలోని న్యూ చిట్యాల గ్రామంలో గంగమ్మతల్లి తిరునాళ్ల సోమవారం గ్రామస్తులు ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవతో పూజలను ప్రారంభించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పొంగించి, భోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు వచ్చారు. భక్తులు అమ్మవారికి చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎంపీపీ చన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులతో కలసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూనావతు నరసింహ నాయక్, ఎంపీటీసీ శ్రావణిబాయి, పార్టీ నాయకులు మర్రి ప్రసాదరెడ్డి, భద్రయ్య, వైస్ సర్పంచ్ హుస్సేన్, తులసీ నాయక్, రామాంజనేయులు నాయక్, శైలజాబాయి, రామారావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు

సత్తెనపల్లి: మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని గుంటూరు జిల్లా రీసోర్స్ పర్సన్ కట్టా కాళీదాస్ పేర్కొన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం, సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మి సూచన మేరకు పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో మహిళల కోసం ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు సోమవారం నిర్వహించారు. సత్తెనపల్లి ఏజీపీ షేక్ బాలి సైదా అధ్యక్షత వహించారు. సదస్సులో కాళీదాస్ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. సెక్షన్ 498, మహిళలకు ఆస్తి హక్కు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, భరణం, మహిళా పరిరక్షణ ప్రత్యేక చట్టాలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జాన్సీ, సత్తెనపల్లి ప్యానల్ న్యాయవాదులు బీఎల్ లక్ష్మికోటేశ్వరరావు, బి.అమర్ నాయక్, గంటా వెంకట శివ, పారా లీగల్ వలంటీర్లు షేక్ సుబాని, షేక్ ఖాజా, ముబారక్, గోపాల్ 150 మంది మెప్మా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రీసోర్స్ పర్సన్ కాళీదాస్

తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం

ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర రీజినల్ కో-ఆర్డినేటర్ వెంకట్రావు

సత్తెనపల్లి: రైతులందరూ.. ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చునని, ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర రీజినల్ కో-ఆర్డినేటర్ వెంకట్రావు పేర్కొన్నారు. మండలంలోని బృగుబండ గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సుకు ప్రకతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమల కుమారి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రావు మాట్లాడుతూ.. 365 రోజులు భూమి పైన ఏదో ఒక పంటతో కప్పి ఉండాలన్నారు. ఘన జీవామృతం, బూడిద, బంకమట్టి, ఆవు మూత్రం మొదలగు పదార్థాలనుపయోగించి ప్రత్యక్షంగా ఐదు రకాల విత్తనాలతో విత్తన గుళికల తయారీ విధానం చేసి చూపించారు. ఈ విత్తన గుళికలను భూమిలో నాటిన తర్వాత.. ఆరు నెలల లోపు వర్షం పడకపోయినా మొలక శాతం విషయంలో ఎలాంటి నష్టం ఉండదని చెప్పారు. రైతులు ఈ పద్ధతి ప్రస్తుతం ఆచరించడం వల్ల.. ఉగాదికి ముందు వచ్చే వర్షంతో.. విత్తన గుళికల మొలకెత్తుతాయని తెలిపారు. రైతులకు పీఎండీఎస్ వేసుకోవడం ద్వారా భూమికి కలిగే ప్రయోజనాలు వివరించారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో ఐదు లేయర్ మోడల్ సాగు చేస్తున్న తోటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి ఇన్‌చార్జ్ ఏడీఏ, మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీధర్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు జీవనజ్యోతి, సత్తెనపల్లి డివిజన్ మాస్టర్ ట్రైనర్ నందకుమార్, బృగుబండ యూనిట్ ఇన్‌చార్జ్ శైలజ, రజిని, ఐసీఆర్పీఎస్ నిర్మాల రాణి, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, చిన్నారులు, తదిరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో వెంకట్రావు, పక్కన అమలకుమారి తదితరులు

చాగంటివారిపాలెంలో 'ఫ్యామిలీ డాక్టర్'

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ, ఎన్.సూర్యప్రకాశరావులు పాల్గొని, 75 మందికి వైద్యసేవలందించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. మధ్యాహ్నం నుంచి అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి అవసరమైన వైద్యసేవలను అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ప్రవల్య, ఏఎన్ఎంలు నూర్జహాన్, వెంకటరత్నం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రచురణ

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి గ్రామ వార్డు సభ్యుని ఎన్నికకు ఓటరు జాబితా ప్రచురించినట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. గుండ్లపల్లి గ్రామంలోని 5వ వార్డు సభ్యుడు, ఉప సర్పంచ్ మారెళ్ల ఆదిరెడ్డి ఇటీవల రాజీనామా చేసినట్లు తెలిపారు. ఆ స్థానంలో ఎన్నిక నిర్వహించేందుకు గాను ఓటరు జాబితా ప్రచురించామన్నారు. వార్డు పరిధిలో 534మంది ఓటర్లు ఉన్నారన్నారు. జాబితాను పోలింగ్‌కేంద్రం వద్ద ప్రచురించామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జాన్‌పీరా, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' గ్రామసభ

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభ సోమవారం జరిగింది. గ్రామ సభలో 2021-22 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను తనిఖీ చేసి గుర్తించిన అంశాలను గ్రామసభలో చర్చించారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల ద్వారా నిర్మించిన ప్రభుత్వ భవనాల నిర్మాణాల రికార్డులను చదివి గ్రామ సభలో ఆమోదించారు. ఏమైనా అభ్యంతరాలుంటే గ్రామసభలో తెలిపాలని కోరారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ రామారావు, డీఆర్పీలు ఖాజా, సుదర్శన్, కృష్ణమూర్తి, ఉపాధిహామి సిబ్బంది, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్ పర్యటన

పెదకూరపాడు: మండలంలోని గారపాడులో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జెడ్పీ చైర్‌పర్సన్ హెని క్రిస్టినా మంగళవారం పర్యటిస్తారని జిల్లా పార్టీ నాయకులు శివాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.30లక్షలతో నిర్మించిన చెక్‌డ్యామను, రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును వారు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయ వృత్తిని అవమానిస్తున్న డీఈఓ

డీఈఓ వెంకటప్పయ్యకు వ్యతిరేకంగా ఉపాధ్యాయుల నిరసన

సత్తెనపల్లి: ఉపాధ్యాయ వృత్తినే పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి మేకతోటి వెంకటప్పయ్య అవమానపరుస్తున్నారని ఉపాధ్యాయులు, ఆ సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. డీఈఓ విధుల నుంచి ఆయనను తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని అబ్బూరు, పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, సుగాలీ కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయులను, ప్రజా ప్రతినిధులను కించపరిచే విధంగా డీఈఓ వెంకటప్పయ్య వ్యవహరిస్తున్నారన్నారని ఆరోపించారు. తక్షణమే ఆయనను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయా పాఠశాలల ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు తదితరులు ఉన్నారు.



జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఎదుట నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

అపోహలు వీడండి.. శుభ్రంగా భోజనం చేయండి

అచ్చంపేట: జగకనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో ఫోర్టిఫైడ్ రైస్, నాణ్యమైన మెనూతో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారని.. విద్యార్థులంతా గతంలో ఉన్న అపోహలు వీడి శుభ్రంగా భోజనం చేయాలని హెచ్ఎం లక్ష్మీ నారాయణ సూచించారు. 1250 మంది విద్యార్థులకు పైగా ఉన్న స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం ఆయన విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలో 1250మంది విద్యార్థులుండగా సగం మంది కూడా భోజనం చేయడం లేదన్నారు. గతంలో మధ్యాహ్నం భోజనం తింటే కడుపునొప్పి వస్తుందని, అశ్వస్థతకు గురవతారన్న అపోహలుండటం వల్లనే విద్యార్థులు ఈ పథకాన్ని సక్రమంగా వినియోగించుకోలేకపోతున్నారని అభిప్రాయపడ్డారు. అలాంటి అపోహలను పారద్రోలేందుకే తాను విద్యార్థులతో కలసి పిల్లలకు వండిన భోజనాన్ని భుజించానని చెప్పారు. కోడిగుడ్డుతో, మారిన మెనూతో భోజనం రుచిగా, శుభ్రంగా ఉందన్నారు.



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న హెచ్ఎం లక్ష్మీనారాయణ

నాగవరంలో ఇరువర్గాల ఘర్షణ

పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చిన పోలీసులు

క్రోసూరు: మండలంలోని నాగవరంలో ఆదివారం రాత్రి ఒకే సామాజిక వర్గానికి చెందిన ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. రాళ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. ఎస్ఐ మణికృష్ణ వివరాల మేరకు.. ఆధిపత్యం కోసం ఒకే సామాజిక వర్గం రెండు వర్గాలు ఏర్పడి పాతకక్షలు నేపథ్యంలో దాడులు చేసుకున్నారు. కొద్దిరోజుల క్రితం జరిగిన గొడవల కారణంగా తిరిగి ఆదివారం రాత్రి చిమటా ప్రభాకరరావు ఇల్లు, ఫర్టిలైజర్ షాపుకు వెళ్లి..వల్లా నాగేశ్వరరావు, కొంతమంది వ్యక్తులు గొడవకు దిగారు. అది చూసి అడ్డు వెళ్లిన గోవిందరాజులు, మరి కొంతమందిని గొడ్డళ్లతో, రాడ్లతో దాడి చేసి గాయపరిచారు. ఆ తరువాత ప్రభాకరరావు ఇంటిపై దాడిచేసి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఎరువుల షాపులో వస్తువులు, పురుగుల మందు డబ్బాలను నాశనం చేశారు. చిమట ప్రభాకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామంలో ఒక్కసారికిగా ఇరు వర్గాలు దాడులు చేసుకోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ, సీఐ వీరాస్వామి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఉద్రిక్తత నేపథ్యంలో పికెట్ ఏర్పాటు చేశారు.



దాడిలో ధ్వంసమైన ఇంట్లోని ఫర్నిచర్

డీఈఓపై చర్యలు తీసుకోవాలి

అచ్చంపేట: ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులను తూలనాడిన జిల్లా విద్యాశాఖాధికారి వెంకటప్పయ్యపై చర్యలు తీసుకోవాలని సోమవారం పలు ఉపాధ్యాయ సంఘాలు నిరసనలు తెలిపాయి. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. డీఈవో తన వైఖరిని మార్చుకోవాలని యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయల పట్ల డీఈఓ చులకన భావంతో మాట్లాడటం అమానుషమని ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి వీరవాసు అన్నారు. ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి బాలాజీ, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నల్లబ్యాడ్జీల నిరసనలు బుధవారం కొనసాగుతాయని తెలిపారు. 9, 10 తేదీల్లో మండల విద్యా వనరుల కార్యాలయం ఎదుట నిరసన ప్రదనర్శలు చేస్తామన్నారు. 11, 12, 13 తేదీల్లో ప్రాంతీయ శాఖల సమావేశాలు జరుగుతాయని చెప్పారు. అప్పటికి డీఈవోపై ఏ విధమైన చర్యలు తీసుకోనట్లయితే జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద మహాధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘల ప్రతినిధులు గంగయ్య, హఫీజ్, ప్రకాష్, సాంరెడ్డి, బాలాజి, సుజాత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నవ ధాన్యాలతో భూసారం పెంపు..

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామలో సోమవారం ప్రకృతి వ్యవసాయం కార్యక్రమంలో భాగంగా నవ ధాన్యాలు సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయం డివిజన్ ట్రైనర్ సైదయ్య పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా భూమిలో ప్రధాన పంటకు ముందుగా 5 జాతులు 30 రకాల విత్తనాలు మొత్తం 13 కిలోలు ఒక ఎకరంలో చల్లి పూత దశలో పశు గ్రాసంగా వాడుకుని మిగిలినది భూమిలో కలియదున్నడం ద్వారా తరువాత వేయబోయే ప్రధాన పంటకు అన్ని రకాల పోషకాలు లభిస్తాయని తెలిపారు. భూమి సారవంతం అవుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమలో గ్రామ సర్పంచ్ ముక్కు అంజలి, విద్యార్థులు, టీచర్లు, వీఏఏ కమల, దివ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ మహిళలు పాల్గొన్నారు.



వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

నందిగంలో సినిమా షూటింగ్

సత్తెనపల్లి: శ్రీ గణేష్ దేవి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రాయదుర్గం రమాదేవిరెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తూ నిర్మిస్తున్న 'కాశీ నగర్ 1947' సినిమా షూటింగ్ సత్తెనపల్లి మండలం నందిగం గ్రామంలో సోమవారం జరిగింది. సెంటిమెంట్, ఆధ్యాత్మిక చైతన్యంతో ఉన్న ఈ చిత్రాన్ని నందిగం గ్రామంలోని పలు గృహాల్లో చిత్రీకరిస్తున్నారు. నటులు జెన్నిపై చావిడి వద్ద కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. నరిశెట్టి బాల శౌరయ్య ఆధ్వర్యంలో కంచర్ల శ్రీధర్ గృహంలో కేవీఎల్ నరసింహారావు, దిలీప్ రాథోడ్, ఆరోహి గడిగి (అనురాధ), రాయదుర్గం రమాదేవిరెడ్డిలపై సన్నివేశాలను చిత్రీకరించారు. వల్లెం చెన్నకేశవ నాయుడు ప్రతి నాయకుడి పాత్రలో జగన్నాథ పట్నాయక్‌గా నటిస్తున్నట్లు దర్శక, నిర్మాతలు తెలిపారు. సత్తెనపల్లి చెందిన మద్దు రత్నరాజు, షేక్ సుభాని, జొన్నలగడ్డ రత్నరాజు వివిధ పాత్రల్లో నటిస్తున్నారని, మూగ రాముడుగా దుల్ల రాము, తహసీల్దారుగా గుంటూరు మెగా మూవీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ నాయుడు, లక్ష్మీ, అహ్మద్ నటిస్తున్నారన్నారని తెలిపారు. ఈ చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం చిత్త జల్లు ప్రసాద్ , కెమెరామెన్ జి.కృష్ణ నాయుడు, దేవకి మురళీకృష్ణ, సంగీతం లక్ష్మణసాయి, పాటలు జి.సీతారామ చౌదరి, ఎల్‌వీసీ రఘుబాబు, ఫైట్స్ హుస్సేన్ భాయ్, కొరియోగ్రాఫర్ బండ్ల రామారావు వ్యవహరిస్తున్నారు.



చిత్రం షూటింగ్‌లో ఓ సన్నివేశం

8న క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

సత్తెనపల్లి: పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఉన్న గీతా మల్టీ స్పెషాలిటీ వైద్యశాలలో ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గీతా మల్టీ స్పెషాలిటీ వైద్యశాల, ఒమేగా క్యాన్సర్ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరం జరుగుతుందని వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ గీతా హసంతి సోమవారం తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ కన్సల్టేషన్(గైనకాలజిస్ట్, మెడికల్ ఆంకాలజీ), రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష, గర్భసంచి ముఖద్వార పరీక్ష (పాప్‌స్మియర్), ఈసీజీ (గుండె పరీక్ష), బీపీ, షుగర్ పరీక్షలు, కంప్లీట్ బ్లడ్ కౌంట్ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. రూ. 6 వేలు విలువ గల పరీక్షలను ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. సత్తెనపల్లి పట్టణ పరిసర ప్రాంత మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 94941 01929 నంబరులో సంప్రదించాలన్నారు.

నేడు మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

అమరావతి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ మాధురి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు మహిళా ఎంపీటీసీ సభ్యులకు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లకు, మండల పరిషత్, సచివాలయాల సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆశా వర్కర్లు, వీఏవోలకు, శ్రీరామకృష్ణహిందూ హైస్కూల్ ఆవరణలో ఆటల పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి, ఎంపీపీ మేకల హనుమంతరావు తదితర అధికారులు పాల్గొంటారని తెలిపారు. మహిళా ఉద్యోగులందరూ ఈ ఆటలపోటీల్లో పాల్గొనాలని పేర్కొన్నారు.

నేడు లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవం

మాచవరం: మండలంలోని శింగరాయపాలెం తండా గ్రామ సమీపంలో కొండపై వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నృసింహస్వామి (కొండ సింగరయ్య) వార్షిక కల్యాణ మహోత్సవం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. భక్తులు కల్యాణ మహోత్సవానికి హాజరై , స్వామి వారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని తెలిపారు.